## క్లుప్తంగా

### అయ్యప్ప ధ్యాన మందిరం ప్రారంభం



అయ్యప్ప ధ్యాన మందిరంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**భీమునిపట్నం:** భీమిలి బీచ్ సమీపంలోని వీరాంజనేయ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప ధ్యాన మందిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలో ఆయన పాల్గొన్నారు. సంఘం అధ్యక్షులు కొమ్మినేని ఎర్రునాయుడు, మొకర నర్సింగరావు, పిల్లి శ్రీను, కదిరి జగన్నాథం, కోండ్రు గోవిందు, దూడ మహేష్, భక్తులు పాల్గొన్నారు.

### కరాటే పోటీల్లో ప్రతిభ



దివ్యభవానీని అభినందిస్తున్న రమేష్

**తగరపువలస:** పార్వతీపురంలో ఈ నెల 10న జరిగిన 67వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో శ్రీబాసర జూనియర్ కళాశాల విద్యార్థిని సరగడ దివ్య భవాని గోల్డ్‌మెడల్ సాధించింది. భీమిలి మండలం చిప్పాడకు చెందిన ఈమెను కళాశాల చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్లు వి.వి.డి.రమేష్, మహేశ్వరరెడ్డి తదితరులు అభినందించారు.

### రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు కార్తీక్

**భీమునిపట్నం:** భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్‌స్కూల్ విద్యార్థి రాష్ట్ర స్థాయి అండర్ 14 జట్టుకు ఎంపికయ్యాడు. ఇక్కడ 8వ తరగతి చదువుతున్న చేట్ల కార్తీక్ ఇటీవల విశాఖలో జరిగిన ఎంపికల పోటీలో పాల్గొని రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 21 నుంచి 23 వరకు భీమిలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాడు. కాగా మంగళవారం అతన్ని పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు. రాబోయే పోటీల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

### నేటి నుంచి అన్నసంతర్పణ

**పద్మనాభం:** మండలంలోని మద్ది గ్రామంలోని శ్రీ ధర్మశాస్త్ర సేవా పీఠం వద్ద బుధవారం నుంచి అయ్యప్పలకు అన్న ప్రసాదం సమకూర్చనున్నట్లు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. డిసెంబర్ 20 వరకు ఈ అన్నదానం కొనసాగుతుందని తెలిపారు. అయ్యప్ప మాల ధరించిన వారంతా వచ్చి అన్నప్రసాదం స్వీకరించాలని ఆయన కోరారు.

### అర్హులందరికీ సహకార రుణాలు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

**పద్మనాభం:** అర్హులందరికీ సహకార రుణాలు అందించనున్నట్లు బాందేవపురం కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని బాందేవపురం సచివాలయంలో మంగళవారం ఘర్ ఘర్ కేసీసీ అభియాన్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అందరూ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భీమునిపట్నం బ్రాంచి మేనేజర్ బి.వెంకట అప్పారావు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, డైరెక్టర్లు కనకల ప్రకాష్, రామసింగు ముత్యాలనాయుడు, సీఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

### ఓక్రిడ్జ్‌లో ముగిసిన సదస్సు

**తగరపువలస:** శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండు రోజులపాటు జరిగిన యుఎస్‌సీఆర్సీ ఎంయూఎన్ సదస్సు మంగళవారం ముగిసింది. వాతావరణ ప్రభావాలు, నీటి గర్భంలో జీవితం, భూమిపై జీవితం, సుస్థిరమైన అభివృద్ధిపై సదస్సులో చర్చించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెట్రోలియం ఇంజినీరింగ్ అండ్ ఎర్త్ సైన్సెస్ డైరెక్టర్ డాక్టర్ శాలివాహన, ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల, కార్యదర్శి శ్రీవర్ధన్ పాల్గొన్నారు.



# మాయమాటలు నమ్మి మోసపోవద్దు



బి.ఆర్.తాళ్లవలసలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- జనసేన, టీడీపీ తీరుపై ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఆగ్రహం

**కొమ్మాది:** ఎన్నికల సమయంలో ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. నాలుగున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించేందుకు చేపట్టిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ జెండాను, సంక్షేమ పథకాల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు మెరుగ్గా ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో వలంటీర్, సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మన ముందుకు తీసుకొచ్చారన్నారు. విద్యా వ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొచ్చి, 'నాడు – నేడు' పథకం ద్వారా పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఇలాగే అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం అప్పుల పాలవుతోందని విమర్శిస్తూనే, రాజకీయ లబ్ధికోసం సీఎం జగన్ కంటే ఎక్కువ పథకాలు అమలు చేస్తామంటూ ప్రతిపక్ష నాయకులు తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారన్నారు. అటువంటి వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వార్డు అధ్యక్షుడు పాల రమణా రెడ్డి, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, క్లస్టర్ ఇన్‌చార్జి బోర రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

**పద్మనాభం:** సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామాల్లో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బి.ఆర్.తాళ్లవలసలో మంగళవారం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలు గ్రామ సచివాలయాల ద్వారా అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. బి.ఆర్.తాళ్లవలస సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాలకు రూ.38 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. చంద్రబాబునాయుడు స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాల మాఫీ చేస్తామని హామీ ఇచ్చి మాఫీ చేయకుండా మోసం చేశారన్నారు. ఈనాం రైతులకు రైతు భరోసా ఇచ్చిన ఘనత సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' పుస్తకాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, బి.ఆర్.తాళ్లవలస సర్పంచ్ చందక శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు చందక పైడినాయుడు, బుడ్డివలస – అగ్రహారం సర్పంచ్ పిన్నింటి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు కల్యాణపు మంగారావు, మామిడి శివరామకృష్ణ, కోరాడ రామేశ్వరరావు, సుంకర బంగారప్పుడు, కోండ్రోతు శ్రీనివాసరావు, సిరుగుడి ఆదినారాయణ, ఈర్ల ఈశ్వరరావు, అముజూరి అప్పారావు, కోన రమణ, సీర సూరప్పుడు, బి.వి.ఎ స్.ఎస్.రాజు, బొలె అప్పలనాయుడు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

# ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

**తగరపువలస:** జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని మంగళవారం తెలుపు, నీలం రంగు చామంతులు, బంతి, తులసి మాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పలువురు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో ఈ అలంకరణకు జగన్నాథ సూరప్పడు కుటుంబ సభ్యులు సహకరించారు. భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అలంకరణ చేశారు. అలాగే మజ్జివలస పంచాయతీకి చెందిన రాస పోలమాంబ అమ్మవారిని నిమ్మకాయల దండలతో అలంకరించారు.



సంతపేట కొత్తమ్మతల్లి



మజ్జివలస రాస పోలమాంబ

# ప్రతిపక్షాల మాటలు విశ్వసించొద్దు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

**ఆనందపురం:** ఎన్నికల ముందు ప్రతిపక్షాలు ఓట్ల కోసం చెప్పే మాయమాటలు విశ్వసించొద్దని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం మండలంలోని కుసులవాడ, గొల్లలపాలెం, ఎస్సీ కాలనీలో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో సంక్షేమ, అభివృద్ధి పథకాల కోసం ప్రభుత్వం రూ.18 కోట్లు ఖర్చు చేసిందన్నారు. టీడీపీ హయాంలో దోచుకో, పంచుకో, దాచుకో పద్ధతిలో వనరులు దోపిడీకి గురయ్యాయన్నారు. మళ్లీ 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. పొరపాటున టీడీపీ, జనసేన కూటమికి ఓటు వేస్తే సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు రద్దవుతాయన్నారు. మళ్లీ కిలోమీటర్ల దూరంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగక తప్పదన్నారు. సినిమా నటుల మాటలు ఎవరూ నమ్మడం లేదన్నారు. సినిమాల పేరుతో ప్రజల నుంచి దోచుకున్నది కాకుండా ప్యాకేజీల కోసం రాజకీయాలను ఆశ్రయిస్తున్నారన్నారు. అవినీతి రహిత పాలన కోసం వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు తామురోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి ఏఎంసీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పాండ్రంగి శ్రీను, పాండ్రంగి అప్పారావు, లెంక రాంబాబు, రౌతు వెంకటరావు, కోరాడ అప్పలస్వామినాయుడు, కోరాడ మునిలినాయుడు, లొడగల వెంకటరమణ, గంటా జగదీశ్వరరావు పాల్గొన్నారు.



కుసులవాడలో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

## ఇస్కాన్‌లో వైభవంగా గోవర్ధన పూజ



**కొమ్మాది:** సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో మంగళవారం గోవర్ధన పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా గోవర్ధన పర్వతాన్ని తలపించే విధంగా అన్నం, వివిధ రకాల స్వీట్లు, పలుకులు, పండ్లతో అన్నకూట్ (ఆహార పర్వతం) ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అదేవిధంగా పంచామృతాభిషేకాలు, పూలాభిషేకం, హారతి నిర్వహించారు. ఉత్సవాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# 5న ఓటర్ల తుది జాబితా

**తగరపువలస:** భీమిలి నియోజకవర్గ తుది ఓటర్ల జాబితా డిసెంబర్ 5న వెల్లడిస్తామని ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. భీమిలిలోని తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్వోలు తమను నిర్దేశించిన సమయానికి చేర్పులు, తొలగింపులపై విచారణ జరిపి పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు తమతో సహకరించాలని కోరారు.



వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి

# గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు



పద్మనాభం శాఖ గ్రంథాలయానికి కుర్చీలు అందిస్తున్న ఎంపీపీ రాంబాబు, తదితరులు



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

**పద్మనాభం:** గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని ఎంపీపీ కంటుబోతు రాంబాబు అన్నారు. పద్మనాభం శాఖ గ్రంథాలయంలో మంగళవారం ఆయన గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ సొంత నిధులతో గ్రంథాలయానికి పది కుర్చీలు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, ఎంఈవో బాబూలాల్, లైబ్రేరియన్ నాగరాజు పాల్గొన్నారు.

**ఆనందపురం:** వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలు దోహదపడతాయని చందక లక్ష్మి, కొట్యాడ రమాదేవి, బంటుపల్లి అప్పలస్వామి అన్నారు. మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆనందపురం శాఖా గ్రంథాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**భీమునిపట్నం:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక శాఖ గ్రంథాలయంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆనందరావు, ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ మైలిపల్లి లక్ష్మణరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, అందులోని విలువైన పుస్తకాలను అందరూ చదవాలని కోరారు. అనంతరం గ్రంథాలయ అధికారి మహేష్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

# ఇష్టమైన రంగంలో విద్యార్థులు రాణించాలి



ఆనందపురం హైస్కూల్‌లో జడ్జి విజయలక్ష్మి, తదితరులు



జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

**ఆనందపురం:** విద్యార్థులు తమకు నచ్చిన రంగాలను ఎంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని భీమునిపట్నం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి అండ్ 15వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ విజయలక్ష్మి సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భీమిలి బార్ అసోసియేషన్ కార్యదర్శి నమ్మి సూరి బాబు, సీఐ జి.రామచంద్రరావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కేఆర్‌కే పట్నాయక్ పాల్గొన్నారు.

- గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు భీమిలికి చెందిన పి.వి.వై.ప్రసాద్ రెండు స్టీల్ క్యాన్‌లు, కుర్చీలు, బెంచ్ అందించారు. ప్రధానోపాధ్యాయుడు యు.వి.వి.ప్రసాద్ పాల్గొన్నారు. వేములవలసలో నెహ్రూ చిత్రపటానికి సర్పంచ్ చందక లక్ష్మి, వైస్ సర్పంచ్ బి.రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొట్యాడ రమాదేవి, బి.అప్పలస్వామి నివాళులర్పించారు. బంటుపల్లి కళ్లాల రోడ్డులోని ఐ స్కూల్‌లో వేడుకల్లో జాతీయ క్రీడాకారులు పోతిన ప్రవీణ్, గొలగాని దినేష్, స్కూల్ డైరెక్టర్ కాకర సురేష్‌కుమార్ పాల్గొన్నారు. వెల్లంకి రవీంద్రభారతి స్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

### ఘనంగా బాలల దినోత్సవం

**తగరపువలస:** బాలల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక బహుమతులు అందించారు. రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో అలరించారు. తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం మురళీధర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బాలల దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు టి.ఎస్.వి.ప్రసాదరావు, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, తారకేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులంతా ఉత్తమ పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రిలో బాలల దినోత్సవం నిర్వహించి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. డీన్ పీవీ సుధాకర్, సూపరింటెండెంట్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**భీమునిపట్నం:** స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సింహాచలం, ఉపాధ్యాయులు అల్లాడి శ్రీనివాసరావు, సుజాత కుమారి, రామకృష్ణ, లక్ష్మి, అశోక్ పాల్గొన్నారు.

**మధురవాడ:** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తే చక్కని భవిష్యత్ సొంతమవుతుందని ఏపీ స్టేట్ క్రియేటివ్ కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ వంగపండు ఉష అన్నారు. కొమ్మాదిలోని విజయం స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అమ్మ ఒడి, విద్యాదీవెన తదితర పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలను వివరిస్తూ ఆమె ఆలపించిన గేయాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయలక్ష్మి, శ్రీకనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు వంకాయల మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

**కొమ్మాది:** బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ సమీపంలో గల అంధబాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి.తిరుమల ప్రసాద్ నెహ్రూ గొప్పతనాన్ని వివరించారు. ముందుగా పాఠశాల ఆవరణలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పద్మనాభం:** మండలంలోని తునివలస ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జాన్‌పాల్, పాఠశాల ఉపాధ్యాయుడు పీటర్ సమకూర్చిన బహుమతులను ఎంఈవో ఎస్.డి.బాబూలాల్, హెచ్ఎం అవనాపు అరుణ్ కుమార్ పంపిణీ చేశారు.

**పీఎం పాలెం:** స్థానిక శిష్టకరణాల సేవా సంఘం, శ్రీహెల్పాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రేపటి బాధ్యతాయుత పౌరులుగా అవతరించాలంటే నేటి బాలలను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన బాలలను సత్కరించారు. డొంకాడ అనిల్‌కుమార్ బి.ప్రమీల, జీజీ రామారావు, సంఘ ప్రధాన కార్యదర్శి మండవకురిటి లక్ష్మి, ఉపాధ్యక్షులు పాడి కనక మహాలక్ష్మి, దుర్గాదేవి భవాని, మేరీ రమ్య, వసంత, సంతోషి పాల్గొన్నారు.



వేములవలసలో నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ లక్ష్మి తదితరులు



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



విజేతలతో వంగపండు ఉష, తదితరులు



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



బహుమతులతో తునివలస విద్యార్థులు



బాలుడిని సత్కరిస్తున్న నిర్వాహకులు

# ఎడముఖం... పెడముఖం..

ఆత్మీయ సమావేశంలో కలవని టీడీపీ, జనసేన నాయకులు

**తగరపువలస:** భీమిలిలో మంగళవారం జరిగిన టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు రుచించడం లేదు. నియోజకవర్గంలో కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని వారు గగ్గోలు పెడుతున్నారు. ఇదే విషయం పార్టీ ఇన్‌చార్జి రాజబాబు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో వాపోతున్నారు. వాస్తవానికి భీమిలికి నాయకత్వం వహిస్తున్న రాజబాబుకు ఆ పార్టీలోని సీనియర్ నాయకులు, కార్పొరేటర్లే సహకరించడం లేదనే వాదన వినిపిస్తుంది. కొందరు పార్టీలో ఉంటూ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వర్గీయులుగా చలామణి అవుతున్నారు. దీంతో రెండు వర్గాలుగా ఉన్న టీడీపీ నాయకులు జనసేనతో ఎలా కలిసి పనిచేస్తారనే అయోమయం నెలకొంది. గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన టీడీపీ అభ్యర్థికి 91,917 ఓట్లు లభించగా మూడో స్థానంలో ఉన్న జనసేన అభ్యర్థికి 24,248 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇవి టీడీపీకి వచ్చిన ఓట్లలో నాలుగో వంతు మాత్రమే. ఈ పరిస్థితుల్లో జనసేన వెంట పొత్తు కోసం వెంపర్లాడడం టీడీపీ కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం నాటి సమావేశంలో ఇరుపార్టీల నాయకులు ఎడముఖం, పెడముఖంగానే ఉన్నారు.

# శివాలయాల్లో ప్రత్యేక పూజలు

**మధురవాడ:** మధురవాడ వుడా కాలనీలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, ఐటీ సెజ్ జంక్షన్ సమీపంలోని శ్రీ లలితా త్రిపుర సుందరి సమేత మహాకామేశ్వర స్వామి ఆలయం, సిద్ధేశ్వర స్వామి పీఠంలోని సిద్ధేశ్వర స్వామి ఆలయాల్లో పంచామృత, నారికేళ, సుగంధ అభిషేకాలు నిర్వహించారు.

**పీఎం పాలెం:** కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా ఈ ప్రాంతంలోని శివాలయాలు భక్తులతో కళకళలాడాయి. శృంగేరీ శంకర మఠంలో కొలువుతీరిన శ్రీ ఉమా సిద్ధేశ్వర స్వామికి మంగళవారం ఉదయం 5 గంటలకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. పూజా కార్యక్రమాలను మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. కారుషెడ్ కూడలిలోని శివాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదీప్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక అభిషేకాలు చేశారు.



మహా కామేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

# పీవీజీ రాజుకు ఘన నివాళి

**తగరపువలస:** భీమిలి మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, విజయనగర చివరి పట్టాభిషక్తుడు పీవీజీ రాజు వర్ధంతి సందర్భంగా భీమిలిలో ఆయన విగ్రహానికి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ 1967లో భీమిలి శాసనసభ్యునిగా పనిచేసిన రాజు మాన్సాస్ ద్వారా కోరుకొండ సైనిక స్కూల్‌కు వెయ్యి ఎకరాలు కలుపుకుని మొత్తం 14వేల ఎకరాలు దానం చేశారని గుర్తు చేశారు 108 దేవాలయాలకు అనువంశిక ధర్మకర్తగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు గంటా నూకరాజు, ఎంఎల్‌టీ అధ్యాపకుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం



చందకలో సంక్షేమ పథకాల ప్రదర్శన పట్టిక ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, తదితరులు

**ఆనందపురం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గృహ సారథులు, కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు సూచించారు. చందక పంచాయతీ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల ప్రదర్శన పట్టికను మంగళవారం ఆయన ఆవిష్కరించి పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.